క్లుప్తంగా

27న ఏచూరి సంస్మరణ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 27న నిర్వహించనున్న సీతారాం ఏచూరి సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె. శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని సకాష్‌లో సంస్మరణ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి నాయకులు జమీల, ఖాజాబీ, లతీఫా భాను, శంషాద్, ముస్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవులను రివైజ్ చేయాలి

వైవీయూ: రాష్ట్రంలో దసరా సెలవులను రివైజ్ చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సి.వి.ప్రసాద్, కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్, చంగలరెడ్డి, ఉమాకాంత్ ప్రభుత్వాన్ని కోరారు. మహాలయ అమావాస్య విశిష్టతను గుర్తించి దసరా సెలవులను అక్టోబర్ 3 నుంచి ప్రకటించాలని విద్యాశాఖను కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు విజయజ్యోతి అన్నారు. శనివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రక్తదాన ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీన జాతీయ రక్తదాన దినోత్సవ కారణంగా యువత, ఆరోగ్యవంతులు తమ వంతుగా రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రక్తదాన ప్రచార సేవకుడు ఇండియన్ రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, పీసీసీ మాజీ కార్యదర్శి ఎస్.ఏ. సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ వీసీని తొలగించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కృష్ణారెడ్డిని తొలగించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జి వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి గంగా సురేష్ కోరారు. శనివారం వైవీయూలో వారు గవర్నర్ కు లేఖ రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో ఉన్నత పదవులకు అర్హత ఒకటే ప్రమాణికం కాదని వారి వ్యక్తిత్వం కూడా చూసి వారికి పదవులు ఇవ్వాలన్నారు. వీసీగా ఉన్న కృష్ణారెడ్డి గతంలో లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారికి, అవినీతి అక్రమాలకు పాల్పడిన వారికి విశ్వవిద్యాలయాలలో ఉన్నత పదవులు కట్టబెట్టవద్దని తెలిపారు.

చంద్రబాబు పాలన అట్టర్ ప్లాప్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు ఎన్‌డి విజయజ్యోతి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ముఖ్యమంత్రి చంద్రబాబు వందరోజుల పాలన అట్టర్ ప్లాప్ అయిందని డీసీసీ అధ్యక్షురాలు ఎన్‌డి విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలో ఏదీ కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. వరద బాధితులను ఆదుకోవడంలో వైఫల్యం చెందారన్నారు. ఇప్పుడు తిరుపతి లడ్డు అంశాన్ని తెరపైకి తెచ్చి రాజకీయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇంత విపత్తు జరిగితే ప్రధానమంత్రి పర్యటించక పోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, మాజీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు శ్యామలమ్మ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్

వైవీయూ : కడప నగరం తెలుగుగంగ కాలనీలోని 30 ఆంధ్రా బెటాలియన్‌లో నిర్వహిస్తున్న కంబైన్డ్ ఆన్యువల్ ట్రెనింగ్ క్యాంపు-7లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ కిషన్ దత్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసినవారవుతామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం పలువురు ఎన్‌సీసీ కేడెట్స్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో క్యాంపు డిప్యూటీ కమాండెంట్ పసుపుల రాజశేకర్, సీటీఓలు పవన్, సురేందర్ నాయక్, హైదర్, పరేడ్ శిక్షకులు సుబేదార్ మేజర్ అనిల్‌కుమార్, సీఎల్ రెడ్డి, కొండారెడ్డి, బస్నెట్, రిమ్స్ బ్లడ్‌బ్యాంకు సిబ్బంది, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి



వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి

వైవీయూ/ఏఎఫ్‌యూ: కడప నగరంలోని పలు విద్యాసంస్థల్లో సాంఘిక సంస్కర్త గురజాడ అప్పారావు 162వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గురజాడ అప్పారావు సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వరలక్ష్మి, రమాదేవి, ఉదయ ప్రకాష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గురజాడ రచనల గురించి ఉపన్యసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, తెలుగుశాఖ అధ్యాపకులు డా. టి. హజరతయ్య, డా. నాగరాజు, డా. రాజీవ్‌బాబు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్ మహిళాడిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో శనివారం గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూల మల్లికార్జునరెడ్డి ఉపన్యసించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, డా. ఎం. గురుమోహన్‌రెడ్డి, వీరయ్య, నాగసుధారాణి పాల్గొన్నారు.

ఆధునిక సాహిత్యానికి అడుగు జాడ 'గురజాడ'

కడప కల్చరల్ : ప్రముఖ కవి, వైతాళికుడు గురజాడ అప్పారావు ఆధునిక సాహిత్యానికి అడుగుజాడలా నిలిచాడని తెలుగు భాషోపాధ్యాయులు డాక్టర్ జీవీ సాయిప్రసాద్ అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం ప్రసిద్ధకవి 'గురజాడ అప్పారావు' జయంతిని పురస్కరించుకొని 'గురజాడ సాహిత్యం- సమకాలీన సమాజం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సంచాలకులు ఆచార్య జి.పార్వతి, డా'' జీవీ సాయిప్రసాద్, సిబ్బందితో కలిసి గురజాడ చిత్రపటానికి పూల మాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆచార్య జి.పార్వతి గురజాడ పూర్ణమ్మ గేయాన్ని ఆలపించి విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ, జి.హరిభూషణరావు, ఆర్. వెంకటరమణ, ఎం.మౌనిక, సుమతి, రాణి, కందిమళ్ల రాజారెడ్డి, భూపతి రాయల్, కొత్తపల్లి రామాంజనేయులు తదితరులు వక్తను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పుత్తా పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, బాలు, క్రిష్టారెడ్డి, కృష్ణారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న అతిథులు



మాట్లాడుతున్న మూల మల్లికార్జున రెడ్డి

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు సురక్షిత ప్రయాణమే తమ లక్ష్యమని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక ఆర్‌ఎం కార్యాలయ చాంబర్‌లో డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కడపకు చెందిన కల్యాణ రామమూర్తి కడప నుంచి బెంగుళూరులోని సిల్క్ బోర్డు వరకు కనీసం ఉదయం 2, రాత్రి 2 బస్సులు నడపాలని కోరారు. ప్రొద్దుటూరుకు చెందిన శ్రీరాములు ప్రొద్దుటూరు-వేంపల్లె మధ్య తిరుగుతున్న అద్దె బస్సులు సకాలంలో నడిచేలా చూడాలన్నారు. ఒంటిమిట్టకు చెందిన విజయరావు కడప నగరంలో సిటీ బస్సులు నడపాలని, కడపకు చెందిన రాణి కడప-పులివెందుల బస్సులు కడపలోని బిల్టప్ వద్ద నిలుపడం లేదని ఫిర్యాదు చేశారు. అలాగే బద్వేలుకు చెందిన మున్నా బద్వేలు బస్టాండులోని విచారణ కేంద్రంలో సమాచారం ఇచ్చేందుకు సిబ్బంది ఉండడం లేదని, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, బస్టాండులో ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారని, నాలుగురోడ్ల కూడలిలో రోడ్డుపైనే బస్సులను ఆపుతున్నారని తెలియజేశారు.

- మదనపల్లెకు చెందిన శ్రీసాయి శ్రీనివాస్ కడప-బెంగుళూరు బస్సులకు రిజర్వేషన్ లేని సర్వీసులను మదనపల్లె, చింతామణి బస్టాండు మీదుగా నడపాలని, బెంగుళూరు నుంచి సాయంత్రం 4 గంటల నుంచి గంటకు ఒకటి చొప్పున కడపకు బస్సులు నడపాలని కోరారు.
- అగడూరుకు చెందిన రాజు, రమణలు పులివెందుల నుంచి గంగనపల్లెకు ఉదయం పులివెందుల డిపో నుంచి బస్సులు నడపాలన్నారు. పామూరుకు చెందిన విష్ణు, నరసింహారావులు కడప-మైదుకూరు-పామూరు బస్సు ఉదయం 7 గంటలకు నడపాలని కోరారు. ఆయా సమస్యలను ఆర్‌ఎం డిపో మేనేజర్లకు తెలియజేస్తూ పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

డాక్టరేట్ ప్రదానం



బొమ్మి హారిక

వైవీయూ : కడప నగరానికి చెందిన బొమ్మి హారికకు కంప్యూటర్ సైన్స్‌లో తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. కంప్యూటర్ సైన్స్ ఆచార్యులు డా. సుధ పర్యవేక్షణలో 'అనాలసిస్ ఆఫ్ వెబ్ యూసెస్ మైనింగ్ బేస్ట్ ఆన్ వెబ్‌లాగ్ డేటా' అన్న అంశంపై ఈమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు. కాగా ఈమె అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఐటీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

కడప అర్బన్ : ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, సహకరించినా వారిపై కఠినచర్యలు వుంటాయని రౌడీషీటర్లను కడప ఇన్‌ఛార్జ్ డీఎస్పీ ఎస్. రమాకాంత్ హెచ్చరించారు. శనివారం కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో రౌడీషీటర్లకు ఇన్‌ఛార్జ్ డీఎస్పీ రమాకాంత్ ఆధ్వర్యంలో సీఐ బి. నాగార్జున, ఎస్ఐ హుసేన్, తమ సిబ్బందితో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ కదలికలపై నిఘా వుందని, ఎవరు కూడా అల్లర్లకు, ఘర్షణ జోలికి వెళ్లరాదన్నారు. సత్ప్రవర్తన కలిగి శాంతియుతంగా జీవించే వారికి పోలీస్ సహకారం వుంటుందన్నారు.

ఏడుగురు అరెస్ట్

కడప అర్బన్ : చిన్నచౌక్ సీఐ ఎస్. తేజమూర్తి, ఎస్ఐలు ఎన్. రాజరాజేశ్వర్‌రెడ్డి, పి.రవికుమార్‌లు తమ సిబ్బందితో కలిసి జూదమాడుతున్న వారిపై శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీకృష్ణ ఇన్ లాడ్జి పక్కన పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.75,800 నగదు, కారు, మోటార్‌సైకిల్, రెండుస్కూటీలు, 8 సెల్‌ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ : పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి వ్యవస్థాపకుడు ఎం. అశోక్ పేర్కొన్నారు. శనివారం కడప నగర పరిధిలోని వాటర గండి వద్ద వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్‌తో కలిసి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మనదేశాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో మనమందరం భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛత కార్యక్రమాలను ఒక బాధ్యతగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ మస్తాన్, కళాశాల సిబ్బంది శ్వేత, సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, గణేష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కెరీర్‌కు బాటలు వేసుకోవాలి



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

వైవీయూ : విద్యార్థిదశలోనే తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు, కెరీర్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దుకునేందుకు బాటలు వేసుకోవాలని కడప కేఎస్ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి.వి.ఎస్. మూర్తి పేర్కొన్నారు. శనివారం కళాశాలలో నూతన విద్యార్థులకు ఆరబ్ద్ పేరుతో స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్న కాంక్ష మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి నాగరాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో సాంకేతికత ఎలా పెరుగుతుంది, పోటీ ఎలా ఉండబోతోందన్న అంశాలను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి, ఎండీ కందుల చంద్ర ఓబులరెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. ప్రసాద్, కల్చరల్ క్లబ్ ఇన్‌చార్జి డా. వీరశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీనివాసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల పొదుపు, పరపతి సహకార సంఘం లిమిటెడ్ 69వ వార్షిక మహాసభలో రాష్ట్రంలో అత్యధికంగా 29 మంది సభ్యులతో సభ్యత్వం ఇప్పించి మొదటిస్థానంలో నిలిచిన కడప డిపో కండక్టర్ శ్రీనివాసులు, సీసీఎస్ డెలిగేట్‌కు సంస్థ ఎండీ ద్వారక తిరుమలరావు అవార్డును ప్రదానం చేశారు. శనివారం విజయవాడలో ఈ అవార్డును అందజేశారు. గత ఏడాది కూడా శ్రీనివాసులు అవార్డు అందుకోగా ప్రస్తుత ఏడాది అవార్డు అందుకోవడం గమనార్హం.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఎంపికలు



చదరంగం పోటీలకు హాజరైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాఎంపికలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో యోగ, చదరంగం క్రీడాంశాల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కడప మండల ఎస్‌జీఎఫ్ సమన్వయకర్త ఎస్. సాజిత్ మాట్లాడుతూ మండల, నియోజకవర్గస్థాయిలో రాణించిన క్రీడాకారులు జిల్లాస్థాయి ఎంపికల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. మిత్ర యోగ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, యోగ నిపుణుడు పెంచలయ్య మాట్లాడుతూ దైనందిత జీవితంలో యోగ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం యోగ, చదరంగం క్రీడల్లో పోటీలు నిర్వహించి మండల జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏపీ పీఈటీస్ అండ్ ఎస్ఏ పీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కిరణ్, చదరంగం కోచ్ అనీస్ దర్బారీ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబ ఘర్షణలో ఇద్దరికి గాయాలు

కడప అర్బన్: కడప నగరం సాయిపేటలో కుటుంబసభ్యుల మధ్య రెండు రోజుల క్రితం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో యూనస్‌కు, మరో మహిళకు గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఈ కేసులో 36వ డివిజన్ కార్పొరేటర్ రఫీ కూడా వున్నారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప టూటౌన్ సీఐ బి. నాగార్జున ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. కార్పొరేటర్ రఫీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

నూతన కోర్టు కాంప్లెక్స్ నిర్మాణంపై వినతి



హైకోర్టు జస్టిస్ జి. రామకృష్ణప్రసాద్‌ను కలిసిన కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు

కడప అర్బన్ : వైఎస్‌ఆర్ జిల్లాకు హైకోర్టు జస్టిస్, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జి. రామకృష్ణప్రసాద్ శనివారం జిల్లా న్యాయమూర్తుల వర్క్‌షాపునకు విచ్చేశారు. ఈ క్రమంలో కడపలోని జిల్లా కోర్టు ఆవరణంను పరిశీలించారు. ఆయనను కలిసిన కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. గుర్రప్పనాయుడు కడప కోర్టులో న్యూ కోర్టు బిల్డింగ్ జి ప్లస్ ఫోర్ ఆవశ్యకతను వివరించారు. హైకోర్టు జస్టిస్‌తో పాటు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫైనాన్సియర్ దౌర్జన్యం చేశాడని మహిళ ఫిర్యాదు

కడప అర్బన్: కడప మరాఠీవీధికి చెందిన లక్ష్మిదేవి తన ఇల్లు, అంగడిపై ఫైనాన్సియర్ శనివారం వచ్చి దౌర్జన్యానికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫైనాన్సియర్ వద్ద డబ్బులు తీసుకున్నాని, డబ్బులు ఇవ్వలేదనే కారణంతో అంగడిని పగులగొట్టి, ఇంటి తలుపును పగులకొట్టేందుకు ప్రయత్నించాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంపోస్టు యూనిట్‌తో ప్రయోజనాలు

వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి



కంపోస్టు యూనిట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ : కంపోస్టు యూనిట్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని యోగివేమన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. శనివారం వైవీయూ బాలికల హాస్టల్ ప్రాంగణంలో కంపోస్టు యూనిట్‌ను వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి ప్రిన్సిపాల్, చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, కడప మున్సిపల్ కార్పొరేషన్ పర్యావరణ ఇంజనీర్ రవీంద్రనాథ్ రెడ్డితో కలసి ప్రారంభించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలలో భాగంగా జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వీసీ హాజరై మాట్లాడుతూ సేంద్రీయ వ్యర్థాలను కంపోస్ట్‌గా రీసైక్లింగ్ చేయడం వల్ల నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించవచ్చన్నారు. పోషకాలను రీసైక్లింగ్ చేయడం, కరువుల ప్రభావాన్ని తగ్గించడం వంటి అనేక రకాల పర్యావరణ ప్రయోజనాలను అందిస్తుందన్నారు. ప్రిన్సిపాల్, చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన నేలను నిర్మించడానికి, నేల కోతను నివారించడానికి దోహదపడుతుందన్నారు. తోట, పెరట్‌లో మొక్కల పెరుగుదలను మెరుగుపరచడానికి కంపోస్ట్‌ని ఉపయోగించవచ్చన్నారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ పర్యావరణ ఇంజనీర్ ఎల్. రవీంద్రనాథ్ రెడ్డి కంపోస్ట్ ప్రయోజనాల గురించి వివరించారు. కంపోస్ట్ యూనిట్ వైవీయూలో ఏర్పాటుకు కృషి జరగడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. సుమిత్ర, వసతిగృహాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా ప్రతిజ్ఞ..

వైవీయూ జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలం ఇసుకపల్లి ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పీఓ డా. శ్రీనివాసరావు స్వచ్ఛతా హీ సేవ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అపర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యకు ఉజ్వల భవిష్యత్తు

వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి

వైవీయూ : డిగ్రీ చదవడం ద్వారా చక్కటి అవకాశాలు దక్కించుకోవచ్చని, ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ పట్టుదల, క్రమశిక్షణ, సమయపాలనతో లక్ష్యసాధనకు శ్రమించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ కె. నిర్మల మాట్లాడుతూ విద్యార్థిదశ ఎంతో కీలకమని, బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ ఎం.సి. రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థి ముందు వినడం, మాట్లాడటం, చదవడం నేర్చుకోవాలని, విద్య ద్వారా వినయాన్ని పొందవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రియాజుద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ఎంఈఓపై విచారణ చేపట్టాలి



డీఈఓ అనూరాధకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీ మాలమహానాడు నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రొద్దుటూరు ఎంఈఓ సావిత్రి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న తరుణంలో ఆమె కార్యకలాపాలపై సత్వర విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని ఏపీ రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేష్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన తన బృందంతో జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ, ఆర్‌జేడీ శ్యాముల్‌ను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీతాల విషయంలో సకాలంలో బిల్లులు చేయకుండా నిర్లక్ష్యం వహించి ఉద్యోగులకు పన్నులు పడేలా చేస్తున్నారన్నారు. ఎంఈఓ ప్రైవేటు స్కూలు యాజమాన్యాలతో లంచాలు రాబడుతోందని ఆరోపించారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న మహిళా పీఎస్ సీఐ కృష్ణారెడ్డి

వైవీయూ : ప్రస్తుత సాంకేతిక యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కడప మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. కృష్ణారెడ్డి సూచించారు. శనివారం కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, పోక్సో యాక్ట్, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా, రహదారి భద్రత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థిదశ నుంచే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ జి. రాజు, ఎస్ఐ శాంతమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

వైవీయూ : ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ కడప జిల్లా కన్వీనర్ ఎం. మాణిక్యరాజు కోరారు. శనివారం కడప నగరంలోని వై. జంక్షన్ వద్ద వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అదే విధంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, సంక్షేమ హాస్టల్స్‌లో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలతో అధిక దిగుబడి



కొర్రపంటను పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

వైవీయూ : వర్షాధార పంటలకు ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకుని పండించడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె. అంకయ్య కుమార్ అన్నారు. శనివారం చింతకొమ్మదిన్నె మండలం కమ్మవారిపల్లె పంచాయతీలోని గొల్లపల్లె గ్రామంలో రైతు ఎస్. వెంకటరెడ్డి పొలంలో 'కొర్ర క్షేత్ర దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొర్ర పంట రకాలైన మహానంది గురించి, కంకి పొడవు, పంట కాలం, ఎరువుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా. ఎ. వీరయ్య, మండల వ్యవసాయాధికారి కె. ఈశ్వర్ రెడ్డి, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏంజెల్ అకౌంట్‌తో అనేక ప్రయోజనాలు



ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలకు కెనరా బ్యాంకు అందుబాటులోకి తెచ్చిన కెనరా ఏంజెంట్ సేవింగ్స్ అకౌంట్‌ను కలిగి ఉండడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చని బ్యాంకు రీజినల్ హెడ్ మురళీమోహన్ పిలుపునిచ్చారు. శనివారం బ్యాంకు మహిళా సిబ్బంది నగరంలోని ఏడురోడ్ల కూడలి నుంచి కోటిరెడ్డి కూడలి వరకు ఈ విషయంగా ర్యాలీ నిర్వహించి మహిళలను చైతన్యవంతులను చేశారు. ర్యాలీలో ఈ అకౌంట్ ప్రయోజనాలను తెలియజేశారు. ఈ అకౌంటును 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు వరకు ఓపెన్ చేయవచ్చన్నారు. ఈ అకౌంట్ కలిగిన మహిళలకు కేన్సర్ కేర్, ఉచిత ప్రమాద బీమా బ్యాంకు అందజేస్తుందన్నారు. ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినయోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డివిజనల్ మేనేజర్లు రమేష్, షఫీక్, విలియం కుమార్ తదితరులు పాల్గొన్నారు.